
# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

# నేను చూసిన తొలి సినిమా షూటింగ్

( విజయచిత్ర, 1970, డిసెంబర్ సంచిక నుంచి)



చాలా కాలంగా వుంది. సరే. ఎలాగూ స్టూడియోకి వచ్చాంగదా. షూటింగ్ కూడా

ప్రపంచంలో మేధావంతులుగా పరిగణింపబడే మహాశయులకు కూడా బాల్యంలో ఈ ప్రపంచం కొత్తగానే కనిపిస్తుంది. అలాగే, పెద్ద సినిమా తారలకు కూడా ఒకనాడు సినిమా షూటింగు కొత్తగానూ, వింతగానూ కనిపిస్తుంది. నేటి సినిమా తారలు తొలిసారిగా తాము చూసిన సినిమా షూటింగుల గురించి:—ఈ కొత్త శీర్షికలో తెలియజేస్తారు:

ప్రపంచంలో మేధావంతులుగా పరిగణింపబడే మహాశయులకు కూడా బాల్యంలో ఈ ప్రపంచం కొత్తగానే కనిపిస్తుంది. అలాగే, పెద్ద సినిమా తారలకు కూడా ఒకనాడు సినిమా షూటింగ్ కొత్తగానూ, వింతగానూ కనిపిస్తుంది. నేటి సినిమా తారలు తొలిసారిగా తాము చూసిన సినిమా షూటింగుల గురించి ఈ కొత్త శీర్షికలో తెలియజేస్తారు :

## సావిత్రి

మద్రాసు రావడం నాకు అదే మొదటిసారి; సినిమా అవకాశాలు వస్తే కూడా జారవిడుచుకోకూడదన్న ఆశతో వున్నాను. అప్పటికే నేను నృత్యం బాగా నేర్చుకుని వున్నాను.

విజయావారు 'పాతాళభైరవి' చిత్రం ప్రారంభిస్తున్నారు.

ఆ చిత్రంలో ఒక నృత్యసన్నివేశం వున్నదనీ, అందులో పాల్గొనడానికి మంచి నర్తకి కోసం చూస్తున్నారనీ తెలిసింది. కబురు నాకు కూడా వచ్చింది. నన్ను వాహినీ స్టూడియోకి తీసుకెళ్ళారు. సినిమా స్టూడియో చూడడం అదే నాకు మొదటిసారి. అటూ ఇటూ వింతగా విడ్డూరంగా చూడసాగాను. అసలు సినిమా షూటింగ్ ఎలా చేస్తారో, అక్కడ పద్ధతి ఎలా వుంటుందో చూడాలన్న కోరిక నాకు చాలా కాలంగా వుంది. సరే, ఎలాగూ స్టూడియోకి వచ్చాంగదా, షూటింగ్ కూడా చూడాలనిపించి, నన్ను స్టూడియోకి తీసుకొచ్చిన వారిని అడిగాను. వాళ్ళ చిత్రమే "షావుకారు" షూటింగ్ జరుగుతున్నదనీ, చూడవచ్చుననీ చెప్పారు. నేను ఫ్లోర్ లో అడుగు పెట్టాను. పెట్టీ పెట్టగానే 'సైలెన్స్' అని పెద్ద కేక వినిపించింది. ఎక్కడి దాన్ని అక్కడే కుక్కిన పేనులా, బొమ్మలా నించుండిపోయాను. ఎదురుగా లైట్లు, కెమెరా, నటులూ అందరూ కనిపించారు. వింతగా చూస్తున్నాను. ఒకాయన 'విజిల్' ఊదగానే, పాట వినవచ్చింది. అది హరికథ. 'హరికథ షూటింగ్ జరుపుతున్నారన్నమాట' అనుకున్నాను. దర్శకులు, నిర్మాతలూ అనుకుంటాను అక్కడ కూర్చుని వున్నారు. వారికి దగ్గర్లోనే ఒక పల్లెటూరి వ్యక్తి, బీడీ పీలుస్తూ నించుని వున్నాడు. "ఇదేమిటీ, సభ్యత లేకుండా ఈయన, పెద్దవాళ్ళ ముందు బీడీలూ అవీనూ" అనుకున్నాను. తీరా అడిగితే.. అది ఆ చిత్రంలోని పాత్ర. మసక మసకగా వుండడం చేత ఆ వ్యక్తి ముఖాన రంగు ఉన్నట్టు నేను గమనించలేదు. ఆయనెవరని అడిగితే... "ఎస్.వి. రంగారావు ఇప్పుడిప్పుడే వస్తున్నారు" అని చెప్పారు. "ఓహో" అనుకున్నాను. నేను చూసిన షూటింగ్, ఆ పాటలోని చిన్న భాగం. అదే, పదే పదే వేస్తున్నారు; రిహార్సల్సు చేస్తున్నారు; షూట్ చేస్తున్నారు. ఇంతలో నన్ను 'డాన్స్ హాల్' కు రమ్మంటున్నారని కబురు వచ్చింది. ఫ్లోర్ నుంచి బయటికి వచ్చాను. ప్రొజెక్షన్ థియేటర్ దగ్గర ఒకాయన ఎవరితోనో మాట్లాడుతూ కనపించారు. ఆయనను దూరం నుంచే గుర్తుపట్టాను అక్కినేని నాగశ్వరరావు గారు! నేను ఆయన చిత్రాలు చాలా చూశాను. ఆయన నటనంటే నాకు ఎంతో ఇష్టం. ఆయన మీద నాకు గౌరవభావం వుంది. అనుకోకుండా కనిపించారు గదా అని, నా అంతట నేనే ఆయన దగ్గరకు వెళ్ళి "నమస్కారం" అన్నాను. ఆయన కూడా "నమస్కారం" అన్నారు. అంతే మళ్ళీ పక్కాయనతో మాట్లాడుతున్నారు. నన్ను పలకరిస్తారనీ, ఎవర మీరని అడుగుతారనీ ఆశించాను. కాని, ఆయన ఇంకేమీ మాట్లాడలేదు. కాస్సేపు నించుని, నేను 'డాన్సు హాల్' దగ్గరకు వెళ్ళపోయాను. అక్కడ చిత్ర దర్శకులైన కె.వి.రెడ్డిగారికి నన్ను పరిచయం చేశారు. కాస్సేపు వాళ్ళందరూ మాట్లాడుకున్న తర్వాత "ఆ అమ్మాయి ఎవరో తెలివైన దానిలాగే వుంది" అన్నారు కె.వి.రెడ్డిగారు. ఆ మాట నాకూ వినిపించింది. ఆ నృత్యంలో పాల్గొనడానికి నేనే ఎన్నికయ్యాను; ఐతే, మొదటిసారిగా నేను షూటింగ్ లో పాల్గొన్న చిత్రం 'సంసారం.'

## జయలలిత

'శ్రీశైల మహత్యం' అనే కన్నడ చిత్రంలో మా అమ్మగారు నటించారు. అప్పుడు నాకు ఆరో సంవత్సరం. ఒకరోజు షూటింగ్ చూడాలనిపించి, సాయంకాలం బడి నుంచి రాగానే అమ్మతో బయల్దేరాను. ఇంకా షూటింగ్ ప్రారంభం కాలేదు. అమ్మ, ముఖానికి రంగు వేసుకుంటున్నారు. వాళ్ళలో వాళ్ళు ఏవేవో మాట్లాడుకుంటున్నారు. 'షూటింగ్ ఉంటుందా, ఉండదా' అని చర్చించుకుంటున్నారు. కారణం ఏమిటంటే ఆ చిత్రంలో నటించవలసిన ఒక చిన్న అమ్మాయి (ఆ చిత్రంలో శ్రీమతి కృష్ణ కుమారి కూడా నటించారు. ఆమె చిన్నతనంలోని వేషం అన్నమాట) వంట్లో బాగులేని కారణంగా షూటింగ్ కు రాలేదట. ఆ అమ్మాయి కోసం అని సెట్టు ఆపడానికి వీల్లేదట. నన్ను చూసిన ఒకాయన. వెంటనే అమ్మగారి దగ్గరకు వెళ్ళి ఏదో మాట్లాడారు. అమ్మ సరేనన్నారు. ఆ రోజు షూటింగ్ లో చిన్న డాన్సు కూడా వుంది. నాకు ఆడాన్సు నేర్పించి, ఆ పాత్ర నటించమన్నారు. నేను నటించాను. అంతగా తెలుసుకోవాలనే వయస్సు కాదు అప్పుడు. విశేషం ఏమిటంటే_ నేను చూసిన మొదటి షూటింగు, నేను పాల్గొన్న మొదటి షూటింగూ అదే అయిందన్నమాట.

## రాజశ్రీ

మా అన్నయ్య మద్రాసులో మెడిసిన్ చదువుతున్నాడు. మా అక్కతో నేను మద్రాసువచ్చాను. అప్పుడు నేను చిన్న పిల్లను. మేము వుంటున్న ఇంటి పక్కనే ఒక ఆడిటర్ గారు వుండేవారు. వారి అమ్మాయికి నృత్యం నేర్పించేవారు. నేను రోజూ అది గమనించేదాన్ని. నాకూ నృత్యం నేర్చుకోవాలని అనిపించేది. నాకు వీణ నేర్పిస్తున్నారు కాని, నా దృష్టి నృత్యం మీద వుండేది. నాకు వీణ నేర్పుతున్న ఆవిడకు నృత్యం కూడా తెలుసు. ఆవిడ అన్నారు "అమ్మాయికి నృత్యంలో ఆసక్తి వుంది. నేర్పిస్తే బావుంటుంది" అని. పక్క ఆడిటర్ గారింట నృత్యం నేర్పుతున్న ఆయన ప్రఖ్యాత నాట్యాచార్యులైన

దండాయుధపాణి పిళ్ళై గారి శిష్యుడు. అక్కయ్య, ఆయన్ని అడిగితే నాకు కూడా నృత్యం నేర్పుతానన్నారు. కాని, ఆయన చాలా బిజీగా వుంటారు. అంచేత వారానికి మూడు రోజులు మాత్రం వచ్చి నాట్యం నేర్పేవారు.

సినిమా షూటింగ్ చూడాలన్న ఉద్దేశ్యంతో ఒక రోజు ఏ.వి.యమ్. స్టూడియోకి వెళ్ళాము. 'నాగులచవితి' షూటింగ్ జరుగుతోంది. చూద్దామని వెళ్ళబోతూ వుంటే, నాకు నాట్యం నేర్పుతున్న మాస్టారు కనిపించారు. 'ఏమిటిలా వచ్చావు?' అన్నారు. నేను చెప్పాను. 'ఆఁ మాట... ఇలా రా' అని ఆయన నన్ను ఒక పెద్ద హాలు దగ్గరకు తీసుకెళ్ళారు. అక్కడ చాలా మంది పిల్లలు వున్నారు. ఆ చిత్రంలో శ్రీమతి జమున నటిస్తున్నారు. ఆమె చిన్నతనంలోని పాత్రకు అమ్మాయి కోసమని అక్కడ ఎన్నిక జరుగుతున్నదట. మా మాస్టారు నాగురించి ఎవరితోనో చెప్పారు. ఆయన నన్ను చూసి "నీకు డాన్సు వచ్చునా అమ్మాయి?" అని అడిగారు. తల వూపాను వచ్చును అన్నట్టు. ఆయన నన్ను ఎగాదిగా చూసి, "ఈ అమ్మాయి చేత వేయిద్దాం" అన్నారు. ఆయనే ఏ.వి.యమ్. స్టూడియో అధిపతి శ్రీ ఏ.వి.మెయ్యప్ప చెట్టియార్ గారు. నాకు అప్పుడు తెలీదు. వెంటనే నాకు డాన్సు నేర్పించారు. శ్రీ దండాయుధపాణి పిళ్ళై గారు ఆ చిత్రానికి నృత్య దర్శకులు. ఆయనే నాకు ఆ నృత్యం నేర్పారు. నేను వేషం వేసుకున్నాను, సెట్లోకి వెళ్ళాను, నటించాను. అదే నేను చూసిన మొదటి షూటింగూ పాల్గొన్న మొదటి షూటింగూ !

★★★

## వచ్చేనెల మరో ఫ్లాష్ బ్యాక్

COMMENTS